క్లుప్తంగా

మూడు బుట్టల విధానాన్ని అమలు చేయండి



తెనాలిఅర్బన్: మూడు బుట్టల విధానాన్ని సక్రమంగా అమలు చేయాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదేశించారు. మారీసుపేటలో సోమవారం తెల్లవారు జామున ఆయన పర్యటించారు. ఆ ప్రాంతంలో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఎక్కడ వ్యర్థాల గుట్టలు కనిపించకూడదని సూచించారు. అలాగే మురుగు కాల్వలను కూడా రోజూ శుభ్రం చేయాలన్నారు. ఆయన వెంట పలువురు మున్సిపల్ ఉద్యోగులు ఉన్నారు.

ప్రజలతో మర్యాదగా వ్యవహరించండి

అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు



తెనాలిఅర్బన్: సచివాలయానికి వచ్చే ప్రజలతో ఉద్యోగులు మర్యాదగా వ్యవహరించాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు సూచించారు. పట్టణంలోని 13, 19 వార్డులలో సోమవారం ఉదయం ఆయన పర్యటించారు. మురుగు కాల్వలను పరిశీలించి సూచనలు చేశారు. అలాగే బోసురోడ్డులో కాల్వలపై ఏర్పాటు చేసిన అక్రమణలను తొలగించాలని టీపీవో సాంబశివరావును ఆదేశించారు. అలాగే పలు సచివాలయాలను పరిశీలించి ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు.

వైభవంగా కల్యాణోత్సవం



తెనాలి: అంగలకుదురులోని శ్రీకోదండ రామసేవక ధర్మసమాజం (దాసకుటి)లో శ్రీఆంధ్ర వాల్మీకి శ్రీవాసుదాసస్వామి 163వ జయంతి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. తొలిరోజున శ్రీవాసుదాసస్వామి పాదుకలకు అభిషేకం, పూజాకార్యక్రమాన్ని నిర్వహించారు. రెండోరోజైన సోమవారం శ్రీభూదేవి శ్రీదేవిసమేత శ్రీనివాసస్వామి కల్యాణం, సీతారామకల్యాణం, శ్రీమహాలక్ష్మి అమ్మవారి సామూహిక కుంకుమ పూజను ఘనంగా జరిపారు. పలువురు భక్తులు పాల్గొన్నారు. మంగళవారం శ్రీరమాసహిత సత్యనారాయణస్వామి వ్రతం జరుగుతుందని, భక్తులు విరివిగా పాల్గొని ఆచార్య అనుగ్రహానికి పాత్రులు కావాలని నిర్వాహకుడు ఉలిచి సీతారాంశర్మ పట్టాభి విజ్ఞప్తిచేశారు.

6 నుంచి పునరుత్థాన పండుగలు

తెనాలిఅర్బన్: హోసన్నా ప్రేయర్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ఈనెల 6,7,8,9 తేదీల్లో పునరుత్థాన పండుగలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అమరావతి ప్లాట్స్‌లోని స్టేడియం వద్ద రోజూ మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు కూడికలు జరుగుతాయని చెప్పారు. బ్రదర్ సాల్మన్ వాక్య పరిచర్య చేస్తారని వివరించారు.

మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకోవాలి

వేమూరు: మద్యం దుకాణాల్లో కల్లు గీత కార్మికులకు 10 శాతం రిజర్వేషన్ కేటాయించినట్లు ఎక్సైజ్ సీఐ రవికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేమూరు ప్రొహిబిషన్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో వేమూరు, కొల్లూరు, అమర్తలూరు, చుండూరు మండలాలున్నాయి. వేమూరు నియోజకవర్గంలోని చుండూరు, అమర్తలూరు కల్లు గీత కులాలకు కేటాయించామన్నారు. కల్లు గీత కులాల వ్యక్తులు ఈ నెల 5వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని ఆయన కోరారు.

మద్యం విక్రేత అరెస్ట్

రేపల్లె రూరల్: మద్యం సీసాలను అక్రమంగా నిల్వ ఉంచిన వ్యక్తిని అరెస్ట్ చేసిన ఘటన మండలంలోని చోడాయాపాలెంలో సోమవారం చోటు చేసుకుంది. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ దివాకర్ వివరాల మేరకు చోడాయపాలేనికి చెందిన గొట్టిపాటి బాబూరావు అక్రమంగా మద్యం నిల్వ ఉంచాడన్న సమాచారంతో సిబ్బందితో దాడులు నిర్వహించామన్నారు. అతని గృహంలో ఆఫీసర్ చాయిస్ 180 ఎంఎల్ మిల్లీలీటర్ల మద్యం సీసాలు ఏడు లభించాయన్నారు. వాటిని స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్ట్ చేశామన్నారు.

రెండు బైక్‌లు ఢీ.. ఒక వ్యక్తికి తీవ్రగాయాలు

మంగళగిరి (తాడేపల్లిరూరల్): రెండు బైక్‌లు ఢీకొట్టుకున్న ఘటన మంగళగిరిలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. సేకరించిన వివరాల మేరకు మంగళగిరి నగర పరిధిలోని ఆత్మకూరు వీజే కళాశాల సమీపంలో సర్వీస్ రోడ్డులో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. మంగళగిరి నుంచి విజయవాడ వైపుగా వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి మరో ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఈ ఘటన జరిగింది. బైక్ నడుపుతున్న వ్యక్తికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు 108 వాహనంలో ఆసుపత్రికి తరలించారు.

మంత్రి మాట.. నీటిమూట

- కుళాయి కనెక్షన్ల హామీ అమలెక్కడ!
- ఏడు నెలలు దాటినా ముందుకు కదలని వైనం
- నిత్యం లీకులతో అల్లాడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



వీఎస్సార్ కళాశాల వద్ద లీకు అవుతున్న కృష్ణా జలాలు

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణ ప్రజల దాహార్తిని తీర్చేందుకు కృష్ణా జలాలను గతంలో తెచ్చాం. కానీ నేటికీ పూర్తిస్థాయిలో ప్రజలకు కుళాయి కనెక్షన్లు ఇవ్వలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అందరికీ కుళాయి కనెక్షన్లు ఇప్పిస్తామంటూ ఎన్నికల సమయంలో తెనాలి శాసన సభ్యునిగా పోటీ చేసిన నాదెండ్ల మనోహర్ వాగ్దానం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటం.. ఆయన పౌరసరఫరాల శాఖ మంత్రి కావడం చకచక జరిగాయి. కానీ నేటికీ తెనాలిలో కుళాయి కనెక్షన్ల జారీ ప్రక్రియ ఊపందుకోలేదు. కనీసం పైపుల లీకులను కూడా నియంత్రించలేని స్థితిలో మున్సిపల్ అధికారులు ఉండటం పలు విమర్శలకు తావిస్తోంది. తెనాలి పట్టణంలో సుమారు 45వేలకుపైగా ఇళ్లు ఉన్నాయి. వీటిలో 2.60 లక్షల మంది నివసిస్తున్నారు. పట్టణం విస్తరించటం, భూగర్భ జలాలు అడుగంటి పోతుండటంతో ప్రజల దాహార్తిని తీర్చేందుకు కృష్ణా జలాలను తెనాలి తీసుకువచ్చేందుకు డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో కృషి చేశారు. దీనిలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ద్వారా సుమారు రూ.95 కోట్ల నిధులను మంజూరు చేయించారు. దీని కోసం పట్టణంలో ఏడు రిజర్వాయర్లు నిర్మించారు. వీటిలో 30.5 మిలియన్ లీటర్ల నీటిని భద్రపరిచే అవకాశం ఉంది. 2014లో పథకాన్ని అప్పటి శాసన సభాపతి, నేటి రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రారంభించారు. అనంతరం పట్టణంలో నివసించే ప్రతి ఒక్కరికీ కుళాయి కనెక్షన్ ఇచ్చేందుకు చర్యలు తీసుకున్నారు.

కృష్ణా జలాలు వృథా

కృష్ణా జలాలను తెనాలి తీసుకువచ్చి అన్ని ప్రాంతాలలో పైప్‌లైన్‌ను ఏర్పాటు చేశారు. వాటిలో తరచూ లీక్‌లు వస్తుండటం వల్ల నీరు వృథాగా పోతోంది. అలాగే ఇళ్లకు ఇచ్చిన కనెక్షన్ల పైపులు సరిగా ఏర్పాటు చేయకపోవటం వల్ల వాటి నుంచీ నీరు వృథాగా పోతోంది. మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. మరమ్మతులు చేపట్టడం లేదు. నామమాత్రపు చర్యలతో సరిపెడుతున్నారు. ఇదిఇలా ఉంటే గతంలో కుళాయి కనెక్షన్ల పైప్‌లైన్‌లు వేసేందుకు రోడ్లన్నీ గుంతలు చేశారు. వాటిని ఇప్పటి వరకు పూడ్చిన దాఖలాలు లేవు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇప్పటికైనా పాలకులు, మున్సిపల్ అధికారులు స్పందించి వెంటనే పట్టణ వాసులందరికీ కుళాయి కనెక్షన్లు కల్పించాలనే డిమాండ్ సర్వత్రా వినిపిస్తోంది.

అమృత పథకం నిధులతో కనెక్షన్లు

రక్షిత మంచినీటి పథకం కుళాయి కనెక్షన్ ఇచ్చేందుకు రూ.8వేలు డిపాజిట్ చేయాల్సి ఉండడంతో అంత నగదును ప్రజలు ఇచ్చేందుకు ముందుకు రాకపోవటంతో అప్పటి పాలకులు అమృత పథకం ద్వారా అందరికీ ఉచితంగా కుళాయి కనక్షన్ ఇచ్చేందుకు చర్యలు తీసుకున్నారు. దీనిలో భాగంగా మొదటి విడత పట్టణంలో 23,370 కుళాయి కనెక్షన్లు ఇచ్చేందుకు రూ.9.09 కోట్లు మంజూరు చేశారు. హైదరాబాద్‌కు చెందిన భూపాల్ ఇంజినీర్ అండ్ కాంట్రాక్ట్ సంస్థ కుళాయి కనెక్షన్లు ఇచ్చే ప్రక్రియ ప్రారంభించింది. ఆ తర్వాత అధికారులు దానిని 13,375 కనెక్షన్లకు పథకాన్ని కుదించారు. 2018లో గడువు ముగిసే నాటికి 10వేలలోపు కనెక్షన్లు కూడా ఇవ్వలేకపోయారు. దీంతో ఉన్నతాధికారులు గడువు పొడిగించటంతో ఆ ప్రక్రియ నేటికీ కొనసాగుతునే ఉంది. ఇంకా అమృత్ పథకం ద్వారా 1998 కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంది.



కుళాయి వద్ద నీరు పట్టుకుంటున్న బాలుడు

సగం ఇళ్లకూ ఇవ్వలే..

తెనాలి పట్టణంలో అధికారుల లెక్కల ప్రకారం 45వేలకుపైగా నివాస గృహాలు ఉన్నాయి. కానీ నేటికి రక్షిత మంచి నీటి కుళాయి కనెక్షన్లు ఇస్తున్న ఇళ్లు కేవలం 13,675. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు దాటినా నేటికీ కుళాయి కనెక్షన్ల ఇచ్చే దిశగా అడుగులు పడలేదు.



తెనాలి వీఎస్సార్ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన రక్షిత మంచినీటి రిజర్వాయర్

కుళాయి కనెక్షన్ల కోసం సంప్రదించండి



తెనాలి పట్టణంలో కుళాయి కనెక్షన్ల మంజూరు ప్రక్రియ కొనసాగుతూనే ఉంది. కొందరు పట్టణ వాసులు వాటిని తీసుకునేందుకు ముందుకు రావటం లేదు. దీంతో కొంత జాప్యం జరుగుతోంది. కనెక్షన్లు కావాల్సిన వారు మమ్మలను సంప్రదిస్తే వారంలోపు ఏర్పాటు చేస్తాం. లీకైన పైపులకూ వెంటనే మరమ్మతులు చేస్తున్నాం.

– ఆకుల శ్రీనివాసరావు, ఇన్‌చార్జి మున్సిపల్ ఇంజినీర్, తెనాలి పురపాలక సంఘం

నెహ్రూనికేతన్‌లో వంటల పోటీలు



తెనాలిఅర్బన్: బోసురోడ్డులోని నెహ్రూనికేతన్ పాఠశాలలో సోమవారం విద్యార్థుల తల్లులకు వంటల పోటీలు నిర్వహించారు. యుకేజీ చదువుతున్న విద్యార్థుల తల్లులు పోటీల్లో పాల్గొని స్టాటర్స్, చాట్స్, స్వీట్లు, సలాడ్, బిర్యానీ వంటి వంటకాలను తయారు చేసి ప్రదర్శనలో ఉంచారు. వాటిని విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ దాసరి మురళీకాంత్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గీతాకాంత్ పరిశీలించారు. విజేతలకు నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

విశ్రాంత ప్రిన్సిపాల్ వాకా పేరిరెడ్డి సేవలు చిరస్మరణీయం

సంస్మరణ సభలో పలు రంగాల ప్రముఖులు

తెనాలి: డిగ్రీ కాలేజి విశ్రాంత ప్రిన్సిపాల్ వాకా పేరిరెడ్డి సంస్మరణ కార్యక్రమం సోమవారం స్థానిక నాజరుపేటలోని ఎస్‌వీఆర్ కన్వెన్షన్ సెంటరులో నిర్వహించారు. పావులూరి ట్రస్ట్ వ్యవస్థాపకుడు పావులూరి శ్రీనివాసరావు సమన్వయ కర్తగా వ్యవహరించారు. పేరిరెడ్డి కామర్స్ అధ్యాపకుడిగా, ప్రిన్సిపాల్‌గా ఎందరో విద్యార్థుల్ని తీర్చిదిద్దినట్లు కొనియాడారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుగ్రహీత డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, ఈఎల్‌వీ అప్పారావు, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మొవ్వా సత్యనారాయణ, శతక రచయిత చందు నాగేశ్వరరావు, ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ నేత హృదయరాజు, బీఎస్ఎన్ఎల్ విశ్రాంత ఉద్యోగుల నాయకుడు సంగిరెడ్డి హనుమంతరెడ్డి మాట్లాడారు. తొలుత పేరిరెడ్డి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. సభకు ముందు శాస్త్రీయ సంగీతంలో గణనీయమైన సేవలను అందించిన సుధాశ్రీనివాస్ బృందం భక్తిగీతాలను ఆలపించింది. కుటుంబసభ్యులు, స్నేహితులు పాల్గొన్నారు.

శ్రీసాయిక్షేత్రంలో వసంత పంచమి



శ్రీసాయిక్షేత్రం పూజల్లో భక్తులు

తెనాలి: వసంత పంచమి పర్వదినం సందర్భంగా రూరల్ మండల గ్రామం నందివెలుగులోని శ్రీసాయి క్షేత్రంలో శ్రీగాయత్రి అమ్మవారికి సరస్వతీదేవి అలంకారం చేశారు. విశిష్టమైన పూజ, అర్చన కార్యక్రమాలను వైభవంగా జరిపారు. అమ్మవారికి సుగంధ ద్రవ్యాధి పంచామృత అభిషేకాలు చేశారు. అనంతరం లలితా సహస్రనామ పారాయణం, మణిద్వీప వర్ణన పూజార్చనలో పలువురు భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు. సాయిబాబాకు మధ్యాహ్న హారతి తదుపరి అందరికీ తీర్థ ప్రసారాలు, అన్న ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం సంధ్య హారతి అనంతరం బాలబాలికలతో సరస్వతీ అమ్మవారి సన్నిధిలో పూజార్చన నిర్వహించి, పూజలో ఉంచిన నోట్‌పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, పరీక్ష ప్యాడ్స్, బిస్కట్లు, చాక్లెట్లు పంపిణీ చేశారు. పిల్లలందరికీ అమ్మవారి కంకణం కట్టి ఆశీర్వచనం అందజేశారు. షిరిడీ సాయి స్వచ్ఛ సేవ ట్రస్ట్ హైదరాబాద్ చైర్మన్ ఎంవీ హరిప్రసాద్ రావు, కార్యదర్శి శ్రీవల్లి అన్నపూర్ణ, శారద చలపతి, పద్మావతి కుమారి, పార్వతి, కోటేశ్వరమ్మ, శుభశ్రీ ,నాగలక్ష్మి, సాంబశివరావు, నాగేశ్వరావు పాల్గొన్నారు.

పోస్టల్ కార్మికుల కోసం పోరాడిన డీఎస్ఎన్



శివనాగేశ్వరరావు చిత్రపటం వద్ద నివాళి

తెనాలి: కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాడిన ఉద్యమనేత దేవిరెడ్డి శివనాగేశ్వరరావు (డీఎస్ఎన్) చిరస్మణీయుడని ఫ్రెండ్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పి.పోలేశ్వరరావు అన్నారు. ఇటీవల హఠాన్మరణం చెందిన పోస్టల్ ఉద్యోగుల సంఘ నేత డీఎస్ఎన్ సంతాప సభను సోమవారం స్థానిక గాంధీనగర్‌లోని అసోసియేషన ఆవరణలో నిర్వహించారు. అధ్యక్షత వహించిన పోలేశ్వరరావు మాట్లాడుతూ, గ్రామీణ పోస్టల్ ఉద్యోగుల హక్కుల సాధన కోసం వేలాదిమందిని సమీకరించి ఢిల్లీలో పోరాటం చేసిన డీఎస్ఎన్, వారికి కొన్ని హక్కులను సాధించగలిగారని సోదాహరణంగా చెప్పారు. అంతేకాకుండా క్రెడిట్ సొసైటీతో పోస్టల్ ఉద్యోగులకు ఎంతగానో మేలుచేశారని తెలిపారు. సీపీఎం నేత ములకా శివసాంబిరెడ్డి, రైతుసంఘం సభ్యురాలు శివకుమార్, ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయీస్‌కు చెందిన యు.సత్యనారాయణ, విశ్రాంత పోస్టల్ ఉద్యోగి వీవీ సుబ్బారావు, ఎస్.నరసింగరావు, వై.రమేష్‌బాబు, ఎ.సత్యనారాయణ, అంబటి సీతారామయ్య మాట్లాడారు. తొలుత డీఎస్ఎన్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

ప్రతి విద్యార్థి లక్ష్యంతో ముందుకు వెళ్లాలి



వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పిస్తున్న అన్నపురెడ్డి కోటిరెడ్డి

మంగళగిరి (తాడేపల్లిరూరల్): విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఎంచుకుని దానిని సాధించే దిశగా జీవితంలో ముందుకు వెళ్లాలని పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ (విజయవాడ 316డీ) అన్నపురెడ్డి కోటిరెడ్డి అన్నారు. తాడేపల్లి మండల పరిధిలోని పెనుమాక వందేమాతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం వ్యక్తిత్వ వికాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ జీవితంలో విజయం సాధించాలంటే లక్ష్యాలను ఏర్పరచుకున్నప్పుడే అది సాధ్యమవుతుందని అన్నారు. ప్రతి విద్యార్థి నూటికి నూరు మార్కులు లక్ష్యంగా పెట్టుకుని చదివినప్పుడే మంచి మార్కులు సాధించడానికి అవకాశముంటుందన్నారు. అనంతరం ప్రతి ఒక్క విద్యార్థి వద్దకు వెళ్లి వారి లక్ష్యాలను అడిగి తెలుసుకుని, విద్యార్థులకు పలు సూచనలు చేశారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక డ్రైవ్



డ్రైవ్ ప్రారంభిస్తున్న కమిషనర్ జి.రఘునాథరెడ్డి

బాపట్ల: బాపట్ల పట్టణంలోని ప్రతి వార్డులో ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ కొనసాగిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని జీబీసీ రోడ్డులో ప్రత్యేక పారిశుద్ధ్య పనులను ప్రారంభించారు. కార్మికులు ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్‌లో చెత్తచెదారం తొలగించడం, డ్రెయినేజీలో పూడికతీత పనులు చేపట్టాలని సూచించారు. చెత్తాచెదారం తొలగించిన తరువాత దోమలకు ఫాగింగ్ పనులు చేపట్టాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సీహెచ్ కరుణ, డి.శ్రీనివాసరావు ఉన్నారు.

రెండు వాహనాలు ఢీకొని ట్రాఫిక్ జామ్



తాడేపల్లిరూరల్ : తాడేపల్లి పట్టణ పరిధిలోని ఉండవల్లి సెంటర్ స్క్యూ బ్రిడ్జి సమీపంలో సీతానగరం నుంచి ఉండవల్లికి వచ్చే రహదారిలో సోమవారం వీఐటీకి యూనివర్సిటీ బస్సు టర్నింగ్ తిరుగుతూ ఓ కారును ఢీ కొట్టింది. వీఐటీ యూనివర్సిటీకి చెందిన బస్సు డ్రైవరు కారులో ప్రయాణిస్తున్న వారిపై దురుసుగా ప్రవర్తించి గొడవకు దిగడంతో అరగంట సేపు ప్రకాశం బ్యారేజ్ వైపు, ఉండవల్లి వైపు ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు వచ్చి యూనివర్సిటీ బస్సును పక్కకు తీయించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

పాఠశాలను విలీనం చేయొద్దు



మున్నంగి(కొల్లిపర): మున్నంగిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల(ఆర్)ను వేరే పాఠశాలల్లో విలీనం చేయొద్దని పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ సంజిదా సుల్తానా, కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు. సోమవారం ఎంపీడీఓ విజయలక్ష్మి, మండల విద్యా వనరుల కేంద్రంలోని అధికారులకు వినతి పత్రం అందజేశారు. పాఠశాలను ఊరిలోనే కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో ఎం.ఆనంద్, ఎస్.సౌజన్య, ఎ.సీతామహలక్ష్మి, వి.శ్యామ్, ఎం.సుశీల, బి.కృష్ణవేణి, ఎం.సుప్రియ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కుమార్ పంప్స్‌లో రక్తదాన శిబిరం



తెనాలి: స్థానిక ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని కుమార్ పంప్స్ ఫ్యాక్టరీ ఆవరణలో సోమవారం తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాల సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఫ్యాక్టరీ సిబ్బంది శిబిరంలో పాల్గొని వంద యూనిట్లకుపైగా రక్తదానం చేశారు. ముఖ్యఅతిథులుగా మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, తెనాలి డీఎస్పీ బి.జనార్దనరావు, ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ టి.సౌభాగ్యవాణి పాల్గొన్నారు. కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రహ్మణ్యం సతీమణి వసుంధర జన్మదినాన ఏటా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. రక్తదానంతో ప్రాణాపాయంలో ఉన్న వారిని కాపాడే అవకాశం ఉందని గుర్తుచేశారు. కుమార్ పంప్స్ ఎండీ కొత్త సుబ్రహ్మణ్యం, జి.శేషగిరిరావు, కె.శ్రీనివాస్, కె.కృష్ణకుమార్, కె.హరికుమార్, కె.శేషుకుమార్, సంస్థ ప్రతినిధులు పర్యవేక్షించారు.

సూపర్ సిక్స్ హామీలు తక్షణమే నెరవేర్చాలి

వైఎస్సార్ సీపీ జిల్లా కార్యవర్గ సమావేశం తీర్మానం



కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నేతలు

తెనాలి: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను తక్షణమే అమలుచేయాలని కోరుతూ వైఎస్సార్ సీపీ జిల్లా నూతన కార్యవర్గ సమావేశం తీర్మానించింది. స్థానిక గౌతమ్ గ్రాండ్ హోటల్‌లో సోమవారం ఏర్పాటైన తొలి సమావేశానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు అధ్యక్షత వహించారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, సమన్వయకర్తలు దొంతిరెడ్డి వేమారెడ్డి, అంబటి మురళీకృష్ణ, బలసాని కిరణ్‌కుమార్, తెనాలి మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు నిమ్మకాయల రాజనారాయణ, షేక్ మస్తాన్‌వలి, సంయుక్త కార్యదర్శి మెట్టు వెంకటప్పారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి డేవిడ్‌రాజు మాట్లాడారు. సమావేశంలో వచ్చిన ప్రతిపాదనలతో అంబటి రాంబాబు తీర్మానాలను ప్రకటించారు. కూటమి ప్రభుత్వం అమలు చేశామని చెబుతున్న ఏడాదికి మూడు సిలిండర్ల పథకంలో కేవలం ఒక సిలిండరు మాత్రమే ఇచ్చారని, ఆర్థికసంవత్సరంలోగా మిగిలిన రెండు సిలిండర్లను ఇవ్వాలని కోరుతూ మరో తీర్మానం చేశారు. ప్రతినెలా ఒక నియోజకవర్గంలో కార్యవర్గ సమావేశం నిర్వహించాలని తీర్మానించారు. పార్టీ నూతన కార్యవర్గంలో నియమితులైన జిల్లా ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యక్షులు, లీగల్ సెల్, రైతు కమిటీ, ఎస్సీ సెల్ వంటి అనుబంధాల సంఘాల నేతలు పాల్గొన్నారు.

డాక్టర్ రంగిశెట్టి రమేష్‌కు తెలుగువెలుగు సాహితీ పురస్కారం



డాక్టర్ రంగిశెట్టి రమేష్‌కు పురస్కారం ప్రదానం

తెనాలి: తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం సాయంత్రం జరిగిన స్వామి వివేకానంద జయంతి ఉత్సవాల్లో తెనాలికి చెందిన కవి, రచయిత డాక్టర్ రంగిశెట్టి రమేష్ (గంగాశ్రీ)కి తెలుగు వెలుగు సాహితీ సేవా పురస్కారం స్వీకరించారు. ప్రస్తుత అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, అధికార భాషా సంఘం సభ్యుడు కత్తి వెంకటేశ్వర్లు, తెలుగు వెలుగు సంస్థ చైర్మన్ పోలోజు రాజ్‌కుమార్ చేతులమీదుగా సత్కారం జరిగింది. ఇదే వేదికపై రమేష్ రచించిన 'గంగాహారతులు', 'శస్త్రాలు' పుస్తకాలను మండల బుద్ధప్రసాద్, కత్తి వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమేష్‌ను పలువురు రచయితలు, కవులు అభినందించారు.

ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలి

వేమూరు: సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. ఎస్సీ వర్గీకరణ అమలుపై ఈ నెల 7న చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమం విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు తెలిపారు. మండల కేంద్రంలోని సోమవారం చలో హైదరాబాద్ పోస్టరు విడదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందాకృష్ణ మాదిగ నిర్వహించే సభకు వేలాది మంది మాదిగలు లక్షల డప్పులుతో కదలి రావాలని పిలుపునిచ్చారు. ఈ ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్లు కూచిపూడి సురేష్, ద్రాప నాని, చిలకా యోహాన్, కాళ హస్తి గోపి, దున్నా నారాయణ పాల్గొన్నారు.

జూద కేంద్రంగా రేపల్లె తీరప్రాంతం

రేపల్లె రూరల్: కూటమి పాలనలో ప్రశాంతమైన రేపల్లె తీర ప్రాంతం జూద కేంద్రంగా మారిందని వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ కరేటి శేషగిరిరావు ధ్వజమెత్తారు. రేపల్లెలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పేకాట, కోడి పందేలు ద్వారా రోజుకు రూ. లక్షల్లో చేతులు మారుతూ ఎందరో జీవితాలు అంధకారమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పగలు, రాత్రి తేడా లేకుండా యథేచ్ఛగా జూదాలు నిర్వహిస్తున్నా.. పోలీసులు పట్టీపట్టనట్లు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారని ఆరోపించారు. ఒకపక్క అక్రమంగా ఇసుకను తరలిస్తూనే మరో పక్క కోడి పందేలు, పేకాటతో అక్రమంగా దండుకుంటున్నారని ఆరోపించారు. జూదాల నియంత్రణకు పోలీసులు చర్యలు తీసుకోకపోతే పార్టీ ఆధ్వర్యంలో అడ్డుకునే కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

వైభవంగా భావనా రుషిస్వామి ఊరేగింపు



రేపల్లె రూరల్: మండలంలోని పేటేరు గ్రామంలో వేంచేసియున్న భద్రావతి సమేత భావనా రుషి స్వామి కల్యాణ మహోత్సవ వేడుకల్లో భాగంగా సోమవారం స్వామి, అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పులి వాహనంపై ఉత్సవ మూర్తులను గ్రామ వీధుల్లో ఊరేగింపు చేశారు. భక్తులు హారతులుపట్టారు. అదేవిధంగా రేపల్లె ఓల్డ్ టౌన్‌లోని భావనా ఋషిస్వామి ఆలయంలో వేడుకల్లో భాగంగా అన్నసంతర్పణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.